క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: జలకన్య ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆలివ్‌కాలనీ, సాయినగర్, తులసినగర్, జలకన్య, భూదేవి హిల్స్, శివనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ జేఎన్‌టీయూ సబ్‌స్టేషన్ పరిధిలో...

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ సబ్‌స్టేషన్ పరిధిలోని వసంత్‌నగర్, టీఎస్‌నగర్, ఫేజ్–2, ఎస్పీనగర్, ధర్మారెడ్డి కాలనీ, నందమూరినగర్, గోకుల్ ప్లాట్స్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు జేఎన్‌టీయూహెచ్‌లో రిక్రూటర్స్ సమావేశం

కేపీహెచ్‌బీకాలనీ: బ్లాక్ బక్స్, జేఎన్‌టీయూహెచ్‌లు సంయుక్తంగా రిక్రూటర్స్ సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం యూఐఐసీ భవనంలో నిర్వహించనుంది. మీట్ గ్రీట్ డైన్ విధానంలో జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా ఫ్రెషర్ స్కిల్స్‌పై చర్చించనున్నారు.

నేడు 'ప్రజాగోస-బీజేపీ భరోసా' బహిరంగ సభ

శేరిలింగంపల్లి: బీజేపీ శేరిలింగంపల్లి డివిజన్ ఆధ్వర్యంలో 'ప్రజా గోస–బీజేపీ భరోసా శక్తి కేంద్ర బహిరంగసభ ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపీనగర్ హనుమాన్ అలయ వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డివిజన్ అధ్యక్షులు రాజుశెట్టి తెలిపారు. ఈ సభల ప్రారంభోత్సవానికి బీజేపీ జాతీయ నాయకులు, మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రభారి పి మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ, డివిజన్ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్‌అధ్యక్షులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్' పై ఒక రోజు జాతీయ సదస్సును శుక్రవారం ఉదయం 9.45 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సెమినార్‌లో పలువురు వైస్ చాన్స్‌లర్లు, స్టడీస్ డీన్లు, వివిధ శాఖల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, విభాగాల అధిపతులు, సీనియర్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, రిజిస్ట్రార్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొంటారు.

'అన్వయ కేర్'కు హైసియా పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: సీనియర్ సిటిజన్స్‌కు అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), ఐఓటీ ఆధారిత సేవలు అందించే నగరానికి చెందిన అన్వయ కిన్ కేర్ సంస్థకు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్ ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా)పురస్కారం దక్కింది. వృద్ధుల్లో కనిపించే డిమెన్షియా సమస్యకు హోమ్ కేర్, ఐఓటి ఆధారిత స్మార్ట్ ఎమర్జెన్సీ సొల్యూషన్స్ అందిస్తున్నందుకు బెస్ట్ ప్రొడక్ట్-ఎస్టాబ్లిష్డ్ కేటగిరీలో ఈ అవార్డ్‌ను రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధులు అందుకున్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బచ్‌పన్ ప్లే స్కూల్స్ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని బచ్‌పన్ ప్లే స్కూల్ పాఠశాల వార్షికోత్సవం హైటెక్ సిటీలోని శిల్పకళావేదికలో ఘనంగా జరిగింది. బచ్‌పన్ ఏహెచ్‌పీఎస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రీజనల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ఢిల్లీ కార్పొరేట్ ఆఫీస్ చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ టి.జయ్‌గుప్తా, కేపీహెచ్‌బీకాలనీ డైరెక్టర్లు కె.శేషారెడ్డి, శ్రీవిద్య, భాగ్యనగర్, టోలిచౌకి డైరెక్టర్లు మురళీధర్, ఇందులత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీగా కె.వెంకట్రామిరెడ్డి



కుత్బుల్లాపూర్: మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీగా కె.వెంకట్రామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన రిపోర్ట్ చేశారు. డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వెంకట్రామిరెడ్డి మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ అయ్యారు. మేడ్చల్ ఏసీపీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభం కానున్న బాలానగర్‌లోని మేడ్చల్ డీసీపీ కార్యాలయం భవనంలోని ఏసీపీ కార్యాలయ నుంచే ఆయన విధులు నిర్వహించనున్నారు.

సుందరీకరణ దేవుడెరుగు..

దుర్గంధ వాకింగ్‌ట్రాక్ ఎందుకు?



అంబీర్‌చెరువు వాకింగ్ ట్రాక్‌పై పడేసిన గుర్రపుడెక్క



గుంతలతో అధ్వానంగా మారిన వాకింగ్‌ట్రాక్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టి నాలుగేళ్లు అయ్యింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. 2019లో అంబీర్ చెరువును సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో పనులు మొదలుపెట్టారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టారు. అయితే చెరువులో మురుగు చేరటంతో గుర్రపుడెక్క ఏపుగా పెరిగింది. దీంతో దోమలు వృద్ధి చెంది ఇక్కడి ప్రాంతవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అప్పటికే నామమాత్రంగా వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలివేశారు.

తొలగించిన రెండు రోజులకే పెరుగుతున్న వైనం

◆ ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు గుర్రపుడెక్కను తొలగించే ప్రక్రియను చేపట్టారు. అందులో భాగంగా నెల రోజులుగా గుర్రపుడెక్కపై రసాయనాలను పిచికారి చేసి జేసీబీ సహాయంతో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. అయినప్పటికి తొలగించిన రెండు రోజులకే గుర్రపు డెక్క తిరిగి ఏపుగా పెరుగుతోంది.

వాకింగ్ ట్రాక్‌పైనే కుప్పలుగా గుర్రపుడెక్క..

తొలగించిన గుర్రపుడెక్కను అసంపూర్తిగా ఉన్న వాకింగ్ ట్రాక్‌పైనే కుప్పలుగా పడేశారు. దీంతో దుర్వాసన వెదజల్లుతూ దోమలకు ఆవాసం



మారింది. దీనికి తోడు వాకింగ్ ట్రాక్ మొత్తం పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో వాకర్స్ నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. గుర్రపుడెక్కలోని మురుగు ట్రాక్‌పై చేరి గుంతలు ఏర్పాడ్డాయి.

మినీ టాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలి..

నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన అంబీర్ చెరువు సుందరీకరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. సుందరీకరణ పనులు అధికారులు, కాంట్రాక్టర్లకు గుర్తుకు వచ్చినప్పుడే పనులు చేపడతారా? లేక ఇక్కడి ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకొని వేగవంతం చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. చెరువు పరిసరాలను ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మినీ టాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు.

వాకింగ్ ట్రాక్‌ను పునర్నిర్మించాలి..



చెరువు సుందరీకరణ పనులు ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి పూర్తి కాలేదు. వాకింగ్ ట్రాక్ పనులు నామమాత్రంగా చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. చెరువులో గుర్రపుడెక్కను తీసిన వెంటనే దూర ప్రాంతానికి తరలించాలి. వాకింగ్ ట్రాక్‌పై వేయకుండా చర్యలు తీసుకోవాలి. అసంపూర్తిగా ఉన్న వాకింగ్ ట్రాక్‌ను తిరిగి పునర్నిర్మించాలి.

– ప్రకాష్‌రాజ్, ప్రగతినగర్

ట్రాక్‌పైనే మద్యం సేవిస్తున్నారు..



సుందరీకరణ పనులు దేవుడెరుగు కొద్దో గొప్పో నిర్మించిన వాకింగ్ ట్రాక్ దుర్గంధంగా మారింది. గుర్రపు డెక్క వ్యర్థాలు ఉండటంతో ట్రాక్‌పై నడవలేని పరిస్థితి. రాత్రి సమయంలో మందుబాబులు ట్రాక్‌పైనే మద్యం సేవిస్తున్నారు. అక్కడే బాటిళ్లను పగుల గొట్టి వెళుతున్నారు. ఇప్పటికైనా ట్రాక్‌ను సుందరీకరించి అందుబాటులోకి తీసుకురావాలి.

– ధనలక్ష్మి, శ్రీనివాస్‌నగర్‌కాలనీ

టార్గెట్స్ పెట్టి ఆస్తిపన్ను వసూలయ్యేలా చూడాలి

ఆస్తిపన్ను సమీక్షలో జోనల్ కమిషనర్ వి.మమత



ఆస్తిపన్ను వసూలుపై అధికారులకు సూచనలు చేస్తున్న జోనల్ కమిషనర్ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో గురువారం ఆస్తిపన్నుపై సంబంధిత అధికారులతో జోనల్ కమిషనర్ వి.మమత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లకు రోజువారీ, నెలవారీ టార్గెట్స్ విధించి వసూలు అయ్యేలా చూడాలని ఉప కమిషనర్లను ఆదేశించారు. ఉప కమిషనర్లు వారంలో రెండుసార్లు ఉదయం, సాయంత్రం ప్రతి బీసీ, టీఐల పన్ను వసూళ్ల టార్గెట్స్‌పై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

◆ సర్కిళ్లలోని సహాయ మున్సిపల్ కమిషనర్లకు తగు సూచనలు జారీ చేయాలని ఆదేశించారు. ఆస్తిపన్ను విభాగం అధికారులు ప్రతిరోజు ఉదయం 8గంటల వరకు క్షేత్రస్థాయిలో ఉండి సర్కిల్ వాట్సాప్‌లలో పోస్ట్ చేయాలని సూచించారు. లేకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

◆ సర్కిల్ సహాయ మున్సిపల్ కమిషనర్లు వారికి సంబంధించి తక్కువ కలెక్షన్ అవుతున్న ప్రాంతాల్లో ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. లేకపోతే వారిపై ఏప్రిల్ నెలలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఉప కమిషనర్లు వార్వారి సర్కిళ్లలోని పాత బకాయిల ప్రకారం ఏఎంసీలు అందరూ ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు.

◆ రోజువారీ టార్గెట్ విధించి వివరాలు జోనల్ కమిషనర్‌కు తెలియజేయాలని ఆదేశించారు. డీసీలు రవికుమార్, రవీందరకుమార్, మంగతాయారు, నాగమణి, సహాయ మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులను ప్రజలు తరిమికొట్టాలి

దొడ్ల రామకృష్ణగౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఎన్నికల సమయంలో పాదయాత్రలతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామంటూ వచ్చే బీజేపీ నాయకులను ప్రజలు తరిమికొట్టాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర పేరుతో బీజేపీ నాయకులు ఓ గ్రూప్‌ను తయారు చేసి ఆల్విన్‌కాలనీ డివిజన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న మోసాలను కప్పిపుచుకునేందుకే పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు.

◆ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ సుమారు రూ.180 కోట్ల నిధులు వెచ్చించి ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో మౌలిక సదుపాయాలైన డ్రైనేజీ, రోడ్లు, వీధి లైట్లు, తాగునీటి సమస్య వంటి అనేక సమస్యలను పరిష్కరించారని తెలిపారు. ఆధారాలు లేని ఆరోపణలు చేసిన బీజేపీ నాయకులు తమ మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలే అజెండాగా పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోమని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు పద్ధతులు మార్చుకోవాలని హితువు పలికారు.

శానిటేషన్‌పై ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోయినపల్లి జీహెచ్ఎంసీ అధికారులతో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయినపల్లిలోని శానిటేషన్ సిబ్బంది సరిగా స్పందించటం లేదన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. శానిటేషన్ విషయంలో ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. 10 రోజులు గడువు ఇస్తున్నామని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీలు రవీంద్రకుమార్, రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

జీఎస్ఆర్‌నగర్‌లో వీధిలైట్ల ఏర్పాటు



వీధిలైట్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్–2 జీఎస్ఆర్‌నగర్‌లో వీధిదీపాల ఏర్పాటు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల భద్రత, సౌకర్యం కోసం డివిజన్ పరిధిలోని డార్క్ స్పాట్లను గుర్తించి వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జీఎస్ఆర్‌నగర్ కాలనీలో మొత్తం 16 వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, పోశెట్టి గౌడ్, లింగయ్య, సాయి ప్రభాకర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలి

రాయదుర్గం: అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం ఈ దేశానికి రక్ష అని బహుజన వాగ్గేయకారుడు, రచయిత, బహుజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు మచ్చ దేవేందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో దళిత్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో »కుల నిర్మూలన ప్రతిఘటన పాటలు అనే కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ వెలివాడ వేదికగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో నానాటికి పాతుకుపోతున్న ఒక సామాజిక రుగ్మత కులం అని అన్నారు.సమాజం స్థిరంగా,క్షేమంగా కొనసాగాలంటే కుల నిర్మూలన జరగాలన్నది అంబేడ్కర్ ఆలోచన, అట్లాంటి వారి ఆలోచనలను ఎప్పుడూ ఆచరణ మార్గంలో తీసుకోవాలన్నారు. ప్రముఖ బహుజన రచయిత జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ నిద్రావస్థలో ఉన్న సమాజాన్ని మేల్కోపడానికి పాటలు ప్రాణం పోస్తాయన్నారు. అలాంటి వేల గీతాలు మచ్చ దేవేందర్ రచించారని గుర్తు చేశారు. అంతకుముందు డప్పు కళాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం హెచ్‌సీయూ దళిత్ స్టూడెంట్ యూనియన్ సభ్యురాలు మహేశ్వరి అధ్యక్షతన జరిగింది.

వీఎన్ఆర్–వీజేఐఈటీలో స్పోర్ట్స్ ఫెస్ట్ షురూ



స్పోర్ట్స్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అర్జున పురస్కార గ్రహీత చేతన్ ఆనంద్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్–వీజేఐఈటీ కళాశాలలో 14వ అఖిల భారత ఓపెన్ సెంటర్ ఇంజినీరింగ్ కాలేజియేట్ స్పోర్ట్స్ ఫెస్ట్ గురువారం ప్రారంభమైంది. అర్జున పురస్కార గ్రహీత చేతన్ ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఈ ఫెస్ట్‌లో పలు రాష్ట్రాలకు చెందిన 52 కళాశాలల నుంచి జట్లు పాల్గొనగా బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, త్రోబాల్, వాలీబాల్, క్రికెట్ క్రీడలు జరుగనున్నాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరామ తెలిపారు. ఈ సందర్భంగా చేతన్ ఆనంద్ మాట్లాడుతూ... వ్యక్తిగత క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలన్నారు. కళాశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ.. జయాపజయాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తితో అన్ని కళాశాలల విద్యార్థులు పోటీ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



'మీ సమస్య మా పోరాటం'తో పరిష్కరిస్తాం

బీజేపీ నాయకుడు గజ్జల యోగానంద్



భాగ్యనగర్‌కాలనీలో పర్యటిస్తూ సమస్యలను పరిశీలిస్తున్న గజ్జల యోగానంద్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీలో గురువారం ప్రజల సమస్యలపై బీజేపీ శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. వీటిలో ముఖ్యంగా డ్రైనేజీ, నీటి సమస్య ప్రధానంగా ఉందన్నారు. కరెంటు తీగలు ఇళ్లపై నుంచి చాలా ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని పేర్కొన్నారు. డివిజన్‌లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక దోమలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి, విద్యుత్ సమస్యలు కనీసం పరిష్కారానికి నోచుకోకపోవటం దారుణమన్నారు. ఈ సమస్యలను 'మీ సమస్య మా పోరాటం' ద్వారా త్వరలో పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సైదులు, శ్రీనివాస్, విజిత్ వర్మ, నవీన్‌గౌడ్, కృష్ణంరాజు, శేషయ్య తదితరులు పాల్గొనారు.

ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇవ్వటం ఆపాలి

విద్యార్థి సంఘం నాయకుల డిమాండ్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో అడ్మినిస్ట్రేటివ్ పదవులు పొందిన వారు పదవులు పొందటం తప్ప విద్యను అందించాలనే విషయం మరిచిపోయారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా గురువారం యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి విద్యార్థి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డైరెక్టర్ పదవులు ఒక్కరికి ఒక్క సంవత్సరం అని ఆర్డర్ ఇస్తూ వారికి కావాల్సిన వారికి మాత్రం 3 సంవత్సరాలైనా మార్చటం లేదన్నారు. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇవ్వటం ఆపాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణ్, ప్రణయ్, భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

నేడు బూత్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్

ప్రారంభించనున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తెలంగాణ బీజేపీ అధిష్టానం బూత్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మేడ్చల్ జిల్లా అర్బన్ బీజేపీ కార్యవర్గ సభ్యుడు సత్యమూర్తి తెలిపారు. ముందుగా శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో జరిగే ఈ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశం అవుతారని చెప్పారు. సిండికేట్‌బ్యాంక్ కాలనీలో 77, 78, 79 బూత్ కమిటీలతో సమావేశమై ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. బూత్ కమిటీలలో 20 మంది సభ్యులు ఉండేలా కమిటీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బండి సంజయ్ రాక సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, అనుబంధ కమిటీల అధ్యక్షులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు సత్యమూర్తి తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

మియాపూర్–బీహెచ్ఈఎల్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



గచ్చిబౌలి: మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు పూణె నమూనా డబుల్ డెక్కర్ (ఒకే పిల్లర్‌పై ఫ్లై ఓవర్, మెట్రో) ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. గచ్చిబౌలి ఔటర్ జంక్షన్‌లో కొండాపూర్ వైపు మల్టీలెవల్ ఫ్లై ఓవర్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలపాలని కోరారు. మియాపూర్‌లోని బొల్లారం చౌరస్తా నుంచి గండి మైసమ్మ వరకు 200 అడుగుల రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, జెఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ, ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి గాజుల రామారం వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. మంత్రి కేటీఆర్ స్పందిస్తూ రెండవ దశ ఎస్ఆర్‌డీపీ పనులకు రూ.4,305 కోట్లతో త్వరలో అనుమతిస్తామని చెప్పారు. కొండాపూర్ ఫ్లైఓవర్‌ను ఆగస్టులో అందుబాటులోకి తీసుకొస్తామని, మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్‌సే హాత్ జోడ్ యాత్రలో భాగంగా గురువారం ఆయన సూరారంకాలనీ పరిధిలోని సాయిబాబానగర్ చౌరస్తా, కృషికాలనీ, హమీద్‌బస్తీ, అంజిరెడ్డి బస్తీ, పుష్పగిరి బస్తీ, శ్రీను బస్తీ, పాండు బస్తీ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ గడపగడపకు »హాత్‌సే హాత్‌జోడో స్టిక్కర్‌ను అతికించి కరప్రతాలు పంచి పెట్టారు.

◆ కొలన్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటని అన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ జెండాను ఎగుర వేస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, జేమ్స్, శ్రీధర్‌రెడ్డి, వీరేష్, గురువారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పోరాడాలి

హాత్‌సే హాత్ జోడో యాత్రలో డా.సత్యం శ్రీరంగం



బాలానగర్‌లో జరిగిన యాత్రలో పాల్గొన్న టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం తదితరులు

బాలానగర్: బాలానగర్‌లోని దుర్గాదేవి ఆలయం నుంచి దాసరి బస్తీ, మీ సేవా, కుమ్మరి బస్తీ, సిక్కుల బస్తీ, గౌడబస్తీ, డబ్బీ, కోమటి బస్తీవరకు 'హాత్‌సే హాత్ జోడో'యాత్ర 4వ రోజు పాదయాత్ర టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో గురువారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజనోల లక్ష్మీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేయి చేయి కలిపి కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రైతులకు రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుపేదలకు ఆరోగ్యశ్రీ పథకం అందాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో డబ్బులు, మద్యానికి అమ్ముడుపోకుండా ఉంటేనే కేసీఆర్ దుర్మార్గపు పాలన అంతమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రతి కార్యకర్త సైనికుడిలా పోరాడాలన్నారు. దేశంలో ప్రజా సంక్షేమ పాలన రావలంటే రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతి, ఏబ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, బండారి నవీన్‌గౌడ్, ఎం.మల్లేష్, యాదగిరి, కృష్ణా రాజ్‌పుత్, మట్టే ప్రసన్నకుమార్, మహమ్మద్ సమీ, మహేంద్, ముఖేందర్ తదితరులు పాల్గొన్నారు.